క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున గురువారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ రెడ్డి రోడ్, న్యూ రాజీవ్‌నగర్, ఓల్డ్ రాజీవ్‌నగర్, డాక్టర్స్ కాలనీ, ఆయుర్వేద హాస్పిటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామివారి మందిరంలో బుధవారం శ్రీమణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గురు స్వామి బల్లెం పూర్ణయ్య స్వామి స్వామివారికి పంచామృత అభిషేకం, నెయ్యాభిషేకం నిర్వహించి హారతులు ఇచ్చారు. మధ్యాహ్నం సుమారు 200 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో స్వాములు, భవానీలు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

8న సహస్ర దీపాలంకరణ సేవ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 8వ తేదీ సాయంత్రం ధనుర్మాసోత్సవాలలో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సహస్రదీపాలంకరణసేవ నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు వేంకటేశ్వరస్వామివారికి విశేషంగా సహస్రదీపాలంకరణ సేవ జరుగుతుందన్నారు.

కనుల పండువగా దీపోత్సవం




విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో పవిత్ర ధనుర్మాసం సందర్భంగా దీపోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి రంగనాథులకు పవిత్రమైన పాశురాలను అర్చక స్వాములు గానం చేశారు. 10 వేల దీపాలతో వేంకటేశ్వరుని తిరునామాలు, త్రిశూలం ఆదిశంకరులకు, పార్వతీదేవి, పరమేశ్వరుడు దేవాలయాల ప్రాంగణంలో దీపార్చన వేడుకగా నిర్వహించారు. భక్తుల గోవింద నామాలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ నిర్వహించారు.

బీమా నగదు అందజేత



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న అజిత్‌సింగ్‌నగర్ 24వ బ్లాక్ ప్రాంతంలోని బచ్చలకూరి కొండయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న కొండయ్య బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షహీన సుల్తానా హఫీజుల్లా కొండయ్య పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి వైఎస్సార్ బీమాలో మంజూరైన లక్ష రూపాయలలో పది వేలు అందజేశారు. మిగిలిన రూ. 90వేలు త్వరలో నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతాయని తెలిపారు.

సైక్లిస్టును ఢీకొట్టిన లారీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కుంచనపల్లి వెంకట సత్యనారాయణ (70) సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా గ్యాస్ సిలిండర్ల లోడుతో ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. సైకిల్‌పై వెళ్తున్న సత్యనారాయణ ఎడమకాలుపైకి లారీ ముందు టైరు ఎక్కటంతో కాలు నుజ్జునుజ్జు అయింది. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న వృద్ధుడిని స్థానికులు లారీ కింద నుంచి పక్కకు తీశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ సంఘటనా స్థలికి చేరకుని క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



దారులన్నీ.. అమ్మ సన్నిధికే

ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో విచ్చేసిన భవానీ మాలధారులు అమ్మ సన్నిధికి చేరుకున్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ వారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో ఇరుముళ్లను సమర్పించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











దీక్ష విరమణ ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్షల విరమణ కోసం ఇంద్రకీలాద్రికి విచ్చేసే భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ రాణా బుధవారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, హోమగుండాలు, ఇరుముడి సమర్పించే కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు, మెట్ల మార్గం, ట్రాఫిక్ మళ్లింపు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎక్కడా ఎటువంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందితో పేర్కొన్నారు. అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని కొండ దిగువకు చేరుకున్న భవానీలతో సీపీ మాట్లాడారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఏమైనా ఇబ్బందులు ఎదరయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట డీఐజీ విశాల్‌గున్ని, అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, దుర్గగుడి ఈవో కెఎస్.రామారావు, పశ్చిమ ఏసీపీ హనుమంతరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న సీపీ, ఈవో, ఇతర పోలీస్ అధికారులు

పండుగ వాతావరణంలో పింఛన్ పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు



దుర్గాపురంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భాస్కర్, రాము

పాయకాపురం(విజయవాడరూరల్): మాట తప్పని-మడమ తిప్పని జగనన్న అవ్వాతాతాలకు అన్న మాట ప్రకారం మూడు వేల రూపాయలకు పింఛన్ పెంచారని నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి అన్నారు. బుధవారం 63వ డివిజన్ 273 సచివాలయం వద్ద 62, 63, 64 డివిజన్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 99 మంది లబ్ధిదారులకు మూడు వేల రూపాయల పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు పండుగ వాతావరణంలో కొత్తగా మంజూరు చేసిన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామన్నారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు అలంపూరు విజయలక్ష్మి, మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మ, సీడీఓ జగదీశ్వరి, పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 27వ డివిజన్ దుర్గాపురంలో పెంచిన పింఛన్ రూ. 3వేలును లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. వలంటీర్ భాస్కర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ డివిజన్ కోఆర్డినేటర్ కొండాయగుంట రాము పాల్గొని లబ్ధిదారులకు అందించారు. ఇచ్చిన హామీ మేరకు చెప్పిన విధంగా పింఛన్‌ను రూ. 3వేలకు పెంచటంతో పాటు గడప వద్దకే పింఛన్ అందజేస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాము అన్నారు.



సింగ్‌నగర్‌లో కొమ్ముకూరి హెలీనమ్మకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ స్పందన

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కులవివక్షత, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత సావిత్రీబాయి పూలే అని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గల ఆయన చాంబర్‌లో బుధవారం వేడుకలు జరిగాయి. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముగ్గురు ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయునులు శైలజ, జ్యోతి, సాయి మున్నీసాలను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి తద్వారా వారి అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, ఏపీ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కోశాధికారి చిట్టూరి హరీష్, బీసీ నాయకులు కోసూరి రమేష్, కె.సతీష్, వై.సత్యనారాయణ, పి.రమేష్ పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న టీచర్లతో శ్రీకాంత్ తదితరులు

ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో


ఏపీ పీటీడీ(ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయునులు పి.అమృత, పి.రూనీ, లక్ష్మిలకు సావిత్రీబాయి పూలే స్ఫూర్తి పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో చాత్తాద శ్రీవైష్ణవ మహిళా నాయకురాలు ఎస్వీ యశోద, నాయకులు టి.పూర్ణయ్య, బీసీ సంఘ నాయకులు కె.నాగమల్లేశ్వరరావు, యు.ఈశ్వర్ రాజు, వీజె రత్నం, ఎం.మోజేష్, ఇ.ప్రమీల, ఎం.దుర్గ, బి.ఆంజనేయులు, ఎ.రాజేశ్వరి పాల్గొన్నారు.

కనులపండువగా ముగ్గురమ్మల జాతర

దొనబండ(ఇబ్రహీంపట్నం): భక్తుల ఇలవేల్పుగా వెలుగొందుతున్న సత్తెమ్మ, మారెమ్మ, కాళియమ్మ (ముగ్గురమ్మల) ఆలయం జాతర దొనబండ గ్రామంలో బుధవారం కనులపండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ముగ్గురమ్మలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి, అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. భక్తులు వీపులకు శూలాలు గుచ్చుకుని కారును లాగి భక్తిని చాటారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

ఎమ్మెల్యే వసంత ప్రత్యేక పూజలు

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ముగ్గురమ్మల ఆలయం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు జాతీయ రహదారి నుంచి ఎమ్మెల్యేకు మేళతాళాలతో సాదరస్వాగతం పలికి ర్యాలీగా తోడుకుని వెళ్లారు. ముగ్గురమ్మలకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.



ముగ్గురమ్మల ఆలయం వద్ద అమ్మవార్లకు బోనాలు తీసుకెళ్తున్న మహిళా భక్తులు

కోవిడ్ మార్గదర్శకాలు పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలని ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ జమీల్ సూచించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని గులామెహిద్దీన్ నగర్ ఆరోగ్యకేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కోవిడ్ వ్యాపించకుండా ప్రతి ఒక్కరూ మాస్కు ధరించడంతో పాటు సోషల్ డిస్టెన్స్ పాటించాలని సూచించారు. అలాగే గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవటంతో పాటు వ్యాక్సిన్ వేయించుకోవాలని ప్రభుత్వ వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

50 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

పాయకాపురం(విజయవాడరూరల్): పీడీఎస్ రైస్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న మినీ వ్యాను, డ్రైవర్‌ను నున్న పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు, పీడీఎస్ రైస్ అక్రమంగా రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు భవానీబార్ వద్ద ఎస్‌ఐ గోవిందు, సిబ్బంది తనిఖీ చేయగా మినీవ్యానులో 50కిలోల బ్యాగులు 80 ఉండగా మినీ లారీని, డ్రైవర్ అశోక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజీవ్‌నగర్ నుంచి బొప్పన సాయి నాగేంద్ర వరప్రసాద్ కోళ్ల ఫారమ్‌కు తరలిస్తున్నట్టు డ్రైవర్ విచారణలో తెలిపాడు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

పెనుగంచిప్రోలు: గ్రామంలోని మూడో గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ విభాగం అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీఎంఓ పి.నవీన్ ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. రోగులకు అందిస్తున్న సేవలు, గర్భిణులకు చేస్తున్న వైద్యపరీక్షల వివరాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పి.ఇందిర, గణాంకాధికారి లక్ష్మీజీ, సిబ్బంది పాల్గొన్నారు.

7న ఎస్‌ఆర్‌ఎస్వీ బీఈడీ కాలేజీ పూర్వ విద్యార్థుల సమావేశం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని ఎస్‌ఆర్‌ఎస్‌వీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల ఏడో తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి జి.గంగాధర్ తెలిపారు. సమావేశం పోస్టర్‌ను ఆ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తమ కళాశాల 2007లో ప్రారంభించామన్నారు. బీఈడీ, డీఈడీ చదివిన విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు. తమ కళాశాలను గతంలో గాంధీనగర్ ప్రాంగణంలో ఉండేదని, 2022 నుంచి విజయవాడ వన్‌టౌన్ కేబీఎన్ కళాశాలలోని ఆలపాటి బ్లాక్‌లో మార్పు చేశామన్నారు. ఈ కళాశాల రీడింగ్ రూమ్‌లో ఏడో తేదీ ఈ సమావేశం జరుగుతుందన్నారు.

సిటీ బస్సు సర్వీసుల రూట్ మళ్లింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణ సందర్భంగా పోలీసుల ఆంక్షలను అనుసరించి ఈ నెల 8వ తేదీ వరకు విద్యాధరపురం ఆర్టీసీ డిపో పరిధిలోని సిటీ సర్వీసులను రూట్ మళ్లించినట్లు డిపో మేనేజర్ కె.సుబ్రమణ్యేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూట్ నంబర్ 11, 31 సర్వీసులు వైఎస్సార్ కాలనీ – పైపుల రోడ్ – సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా చల్లపల్లి బంగ్లా – పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్టాండ్ (పీఎన్‌బీఎస్) మీదుగా ఆటోనగర్, అదే విధంగా 5జె రూట్ సర్వీస్ వైఎస్సార్ కాలనీకి బదులుగా కాళేశ్వరరావు మార్కెట్ నుంచి ఆటోనగర్ వరకు, 218 సిటీ సర్వీస్ పీఎన్‌బీఎస్ నుంచి చల్లపల్లి బంగ్లా – సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా పైపుల రోడ్ ద్వారా జక్కంపూడి కాలనీ జంక్షన్ నుంచి మైలవరం వరకు మళ్లించామన్నారు. అలాగే 3వ నంబర్ రూట్ బస్ కబేళా నుంచి వంగవీటి మోహన్‌రంగా జంక్షన్ – భవానీపురం కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ మీదుగా పీఎన్‌బీఎస్ ద్వారా గవర్నమెంట్ ప్రెస్ వరకు, వన్‌టౌన్ పంజా సెంటర్ నుంచి 7టీ (2 బస్‌లు), తాడిగడప వరకు, 11జె(2 బస్‌లు) పంజా సెంటర్ నుంచి బందరు రోడ్ మీదుగా ఆటోనగర్, పంజా సెంటర్ నుంచి 31జె (2బస్‌లు) బందరు రోడ్ మీదుగా ఆటోనగర్, 3వ నెంబర్ (3బస్‌లు) పంజా సెంటర్ నుంచి గవర్నమెంట్ ప్రెస్ వరకు, 3డీ(1బస్) పంజా సెంటర్ నుంచి దేవీనగర్ వరకు ప్రయాణిస్తాయని తెలిపారు. ప్రయాణికులు గమనించి ఆయా రూట్‌ల మీదుగా ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

స్మృతివనం ముఖద్వారం పనులు త్వరగా పూర్తి చేయాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు వేగంగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. వైభవంగా నిర్మాణమవుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖద్వారం దగ్గర ఉన్న కారిడార్ పనులు అత్యంత వేగవంతంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని చెప్పారు. టెర్రస్‌లో జరుగుతున్న సాండ్ స్టోన్, గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు త్వరగా శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెయింటింగ్, ఉడ్ వర్క్ పనులు దగ్గరుండి పరిశీలించి పలు సూచనలు చేశారు. వారంలోపు పనులన్నీ పూర్తి కావాలన్నారు. ఈ నెల 19వ తేదీన స్మృతివనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించి, జాతికి అంకితమిస్తారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ప్రాజెక్టు మేనేజర్, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.



స్మృతివనం కారిడార్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

భవానీల రద్దీ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణలకు భవానీలు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో దేవస్థానానికి చెందిన ముఖ్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని దుర్గగుడి ఈవో కెఎస్.రామారావు ఆదేశించారు. దీక్ష విరమణల తొలి రోజైన బుధవారం పెద్ద ఎత్తున భవానీలు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం ఆలయ ఈవో కెఎస్.రామారావు చాంబర్‌లో ఏఈవోలు, సూపరిండెంటెంట్లు, ఆలయ అర్చకులు, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. రానున్న నాలుగు రోజులు ఇదే రీతిలో భవానీల రద్దీ కొనసాగే అవకాశం ఉండటంతో అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆలయంలో భవానీలకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడటంతో పాటు త్వరతిగతిన దర్శనం అయ్యేలా చూడాలన్నారు. ఇక క్యూలైన్లు, స్నానఘాట్లతో పాటు హోమగుండాల వద్ద, అన్న ప్రసాదం వితరణ, లడ్డూ విక్రయ కౌంటర్ల వద్ద సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ ఏదైనా ఇబ్బంది ఎదరయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, చంద్రశేఖర్, ఆలయ అర్చకులు ఎల్‌డీ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

సీటు మార్పుపై పునరాలోచన చేయాలి

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల వినతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం సీటు మార్పుపై అధిష్టానం పునరాలోచన చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు సమావేశమయ్యారు. బుధవారం నగరంలోని జింఖానా మైదానం వద్ద గల కందుకూరి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సెంట్రల్ సీటు ఎమ్మెల్యే మల్లాది విష్ణుకే కేటాయించాలని నినాదాలు చేశారు. మల్లాది విష్ణుకు మద్దతుగా కార్పొరేటర్లు రాజీనామా చేయాలని కార్యకర్తలు ఒత్తిడి తెచ్చారు. కొందరు కార్యకర్తలు కల్యాణ మండపం నుంచి ధర్నా చౌక్ వరకు నినాదాలు చేస్తూ వెళ్లారు. అక్కడ కొద్దిసేపు నినాదాలు చేశారు. అయితే అంతిమంగా తాము అధిష్టాన నిర్ణయానికే కట్టుబడి ఉంటామని సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు స్పష్టం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, బాలి గోవింద్, కుక్కల అనిత, ఉద్దంటి సునీత, బంకా శకుంతల, కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పుట్టింటికి చేరుకున్న పేరంటాలమ్మ

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ మేళతాళాల నడుమ పుట్టింటికి చేరుకున్నారు. రాజుల బజార్‌లోని అమ్మవారి పుట్టింటికి వంశస్తులు, పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించిన పల్లకిలో పేరంటాలమ్మను ఉంచి భక్తిశ్రద్ధలతో పుట్టింటికి తీసుకెళ్లారు. సంక్రాంతి సంబరాలకు ఒక రోజు ముందు వరకు అమ్మవార్లు పుట్టింటిలోనే పూజలు అందుకుంటుంది. జనవరి 12న సాయంత్రం అమ్మవారి పుట్టింటి వారసులైన క్లోపల్లి ప్రభాకర్ వర్మ, నరసరాజు, భూపాల్ రాజు సోదరులచే పసుపు, కుంకుమ, నూతన వస్త్రముల బహూకరణతో పాటు యాదవ వంశస్తులైన వేమినేని వారిచే పోతు సమర్పణ అనంతరం అమ్మవార్లు ఊరేగింపుగా పుట్టింటి నుంచి ఆలయ ప్రవేశం చేస్తారు. జనవరి 13 నుంచి 18 వరకు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భోయిన భాను ప్రదీప్, కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, సీఐ కాశీ విశ్వనాథ్, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



పేరంటాలమ్మను పుట్టింటికి తీసుకెళ్తున్న భక్తులు